## క్లుప్తంగా

### చిర్రకుంటలో వైద్య శిబిరం

**ఆసిఫాబాద్‌రూరల్:** వృద్ధాప్య వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వృద్ధాప్య వైద్యశిబిరంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చే అనారోగ్య సమస్యలకు ఆయుష్ వైద్య విధానాల ద్వారా సులువైన వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యురాలు శిల్ప, సందీప్, గౌతమి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వినతి

**దహెగాం:** మండల కేంద్రంలోని రోడ్లన్నీ అధ్వానంగా మారాయని, వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల కేంద్రానికి చెందిన యువకులు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ మండలంలో రోడ్లకు మరమ్మతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండల కేంద్రం నుంచి కల్వాడ వెళ్లే మార్గంలో లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మించాలన్నారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. మండల కేంద్రం నుంచి లగ్గాం వెళ్లే రోడ్డంతా గుంతలమయంగా మారిందని గుంతలు పూడ్చాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు.

### పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**తిర్యాణి:** మధ్యాహ్న భోజన కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఇంట్లో నుంచి డబ్బులు పెట్టి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. కానీ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోయారు. కనీస వేతనం రూ.9వేలు చెల్లించడంతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఊర్మిళ, లక్ష్మి, సునీత, సుశీల, నీలబాయి తదితరులు ఉన్నారు.

### వందశాతం హాజరు నమోదు చేయాలి

**కెరమెరి:** ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల హాజరు వంద శాతం నమోదు కావాలని మండల నోడల్ అధికారి, గోయగాం కాంప్లెక్స్ హెచ్ఎం ఆడే ప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఝరి, కెరమెరి, గోయగాం కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గోయగాంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రికార్డులు నమోదు చేయాలని, ప్రార్థనలో హాజరు కావాలని, జీపీఎస్ కెమెరాతో తీసిన ఫోటోలను గ్రూపులో పోస్ట్ చేయాలన్నారు. ఏఏపీసీ పనులు వంద శాతం పూర్తి చేయాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవంలో విద్యార్థులకు రెండో జత యూనిఫామ్ అందించాలని పేర్కొన్నారు. సమావేశాల్లో కాంప్లెక్స్ హెచ్ఎంలు చంద్రశేఖర్, భరత్‌రావు తదితరులు ఉన్నారు.

### విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

**ఆసిఫాబాద్‌రూరల్:** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ప్రిన్సిపాల్ ప్రవీణ్ బాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పీటీజీ బాలుర గురుకుల పాఠశాలలో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 480 మంది విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొన్నారని, స్కూల్ పీపుల్ లీడర్‌గా ఏడుగురు పోటీ చేయగా సూరజ్ 114 ఓట్లతో గెలుపొందగా, కళాశాల పీపుల్ లీడర్ సీపీఎల్‌గా జంగు 51 ఓట్లతో గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

**కౌటాల:** జ్వరంతో మృతి చెందిన పూజ, కాళీదాస్‌లకు చెందిన కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండాయిపేట గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అలాగే సిర్పూర్(టి) మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సైతం బాధిత కుటుంబాలను పరామర్శించారు.

# విచ్చలవిడిగా 'దేశీ' దుకాణాలు

- జిల్లాలో దేశీదారు మద్యం విక్రయాల కోసం బెల్టుషాపులు ఏర్పాటు
- సరిహద్దు ప్రాంతాల నుంచి రవాణా
- కట్టడికి చర్యలు చేపట్టని అధికారులు



దేశీదారు మద్యం సీసాలు

**కౌటాల:** జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో పాటు మండలాల్లో దేశీదారు మద్యం విక్రయాల కోసం ప్రత్యేకంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. దేశీదారు మద్యం తక్కువ ధరకు లభిస్తుండడంతో ప్రజలు ఈ మందుకు బానిసలవుతున్నారు. మూడేళ్ల క్రితం మహారాష్ట్ర ప్రభుత్వం చంద్రపూర్ జిల్లాలో మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసింది. దీంతో చంద్రపూర్ జిల్లావ్యాప్తంగా లిక్కర్ షాపులు, దేశీదారు దుకాణాలు తెరుచుకున్నాయి. ఇదే అదునుగా కుమురం భీం జిల్లాలో మళ్లీ దేశీదారు అక్రమ రవాణా వ్యాపారం జోరందుకుంది. సిర్పూర్ నియోజకవర్గం మహారాష్ట్ర సరిహద్దులో ఉండటం.. అక్రమార్కులకు వరంగా మారింది. పెద్దఎత్తున మహారాష్ట్ర మద్యం మళ్లీ కాగజ్‌నగర్ డివిజన్‌కు చేరుతోందని సమాచారం.

**ఊరూరా దుకాణాలు..**

మహారాష్ట్ర దేశీదారు వెరైటీని జిల్లాలోని మద్యం ప్రియులు ఇష్టపడుతుండడంతో మహారాష్ట్ర వ్యాపారులు భారీగా దేశీదారును జిల్లాలోకి తరలిస్తున్నారు. దేశీదారు మద్యంలో సంత్ర, బనానా, మ్యాంగో, నిమ్మ, సోంపు, లవంగా, దాల్చిన చెక్క రుచులతో మద్యం పంపిణీ చేస్తున్నారు. కాగా ఈ మద్యానికి బానిసగా మారితే దాని నుంచి బయటకు రావడం కష్టమని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్న 'మద్యం' ఆత్మహత్యలకు ఇదే కారణమని తెలుస్తోంది. మత్తు ఎక్కువగా ఉండటంతో కూలీనాలీ చేసుకునే వారు ఎక్కువగా దీనిని తాగేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో మొత్తం 32 మద్యం దుకాణాలు, మూడు బార్లు ఉన్నాయి. ఏటా వీటి ద్వారా సుమారు రూ.250 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలోని పలు వైన్స్‌షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండడంతో మద్యం ప్రియులు దేశీదారు వైపు మొగ్గుచూపుతున్నారనే ఆరోపణలున్నాయి. అబ్కారీ శాఖ అధికారులు కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో గత ఆరు నెలల్లో 11 కేసుల్లో 21 మందిపై కేసు నమోదు చేశారు. రూ.1.87 లక్ష విలువ గల 485 లీటర్ల దేశీదారును పట్టుకున్నట్లు అబ్కారీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**రోడ్డు, రైలు, జల మార్గాల్లో..**

తెలంగాణ సరిహద్దులోని కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ నుంచి కేవలం గంటలోపే మహారాష్ట్రలోని బల్లార్షా స్టేషన్‌కు చేరుకునే వీలుంది. అక్రమార్కులు బల్లార్షా నుంచి వివిధ రైళ్ల ద్వారా దేశీదారు మద్యాన్ని కాగజ్‌నగర్‌కు తరలిస్తున్నారు. చంద్రపూర్ జిల్లాలో ప్లాస్టిక్ సీసాల్లో లభించే దేశీదారు మద్యం సీసాలను సంచుల్లో వేసుకుని కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేట్ల వద్ద సంచులను రైళ్ల నుంచి విసిరేస్తున్నారు. అనంతరం సంచులను తీసుకుని మోటార్ సైకిళ్ల ద్వారా రహస్య ప్రదేశాలకు తరలించి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. కాగా సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్ర కేవలం 10 కి.మీ. దూరంలో ఉంటుంది. సిర్పూర్ నుంచి విరూర్ పట్టణం కేవలం 35 కి.మీ. దూరంలో ఉండటంలో అక్రమార్కులు రోడ్డు మార్గాన సైతం దేశీదారును తరలిస్తున్నారు. ఇక్కడ నుంచి రేషన్ బియ్యం తరలించి, వచ్చేటప్పుడు దేశీదారు సీసాలను తీసుకొస్తున్నారని తెలుస్తోంది. సరిహద్దున గల పెన్‌గంగ, వార్ధా, ప్రాణహిత నదుల పరీవాహక ప్రాంతం మీదుగా.. నిత్యం జిల్లాలో దేశీదారు దందా యథేచ్ఛగా సాగుతోంది. కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి, గుండాయిపేట్, వీర్దండి, తాటిపల్లి, సాండ్‌గాం, వీరవెల్లి, చింతలమానెపల్లి మండలంలోని రణవెల్లి, దిందా, గూడెం, బెజ్జూర్ మండలంలోని సోమిని, తలాయి గ్రామాల సమీపంలోని ప్రాణహిత, వార్ధా నదులలో నాటు పడవ ద్వారా మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాలకు వెళ్లి దేశీదారును ఆయా మండలాలకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి పట్టణాలకు సైతం తరలిస్తున్నారు.

**పట్టించుకోని అబ్కారీ**

తెలంగాణ మద్యం అమ్మితే లాభాలు అంతంత మాత్రమేనని, మహారాష్ట్రలోని చౌక మద్యం దేశీదారు అమ్మకాలు సాగిస్తే లాభాలు ఎక్కువ వస్తాయని వ్యాపారులు ఈ దందాను ఎంచుకున్నారు. దేశీదారు ఒక్కో పెట్టె ధర రూ.1920 ఉంటుంది. ఒక్కో పెట్టెలో 48 సీసాలుంటాయి. ఒక్కో సీసా రూ.40 ఉండగా.. ఇక్కడ రూ. 70కి విక్రయిస్తున్నారు. ఖర్చులు పోనూ ఒక్కో పెట్టెకు రూ.1200 వరకు లాభం చేకూరుతుంది. దేశీదారు అమ్మకాలు జరుగుతున్నా ఆబ్కారీ అధికారులు అడపాదడపా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అధికారుల అండదండలతోనే వ్యాపారులు ఇష్టారీతిన అమ్మకాలు సాగిస్తున్నారని, అందుకే దాడులు నిర్వహించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**తనిఖీలు ముమ్మరం**



కాగజ్‌నగర్ డివిజన్‌లో దేశీదారు అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు మహారాష్ట్ర వైపు నుంచి వస్తున్న రైళ్లలోని ప్రయాణికులపై నిఘా ఉంచాం. రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసుల సహాయంతో నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. అలాగే సిర్పూర్(టి) అంతరాష్ట్ర రహదారి గుండా పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. పలువురు నిందితులపై కేసు నమోదు చేసి జరిమానా విధిస్తున్నాం. దేశీదారు కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– వి.రవి, ఎక్సైజ్ సీఐ, కాగజ్‌నగర్

# కెలికే అడవుల్లో పులి హల్‌చల్!

- రెండు రోజులుగా తిరుగుతున్నట్లు ప్రచారం
- సమీప గ్రామాల్లో అవగాహన కల్పించిన అధికారులు



కెలికేలో అవగాహన కల్పిస్తున్న మజారోద్దిన్

**కెరమెరి:** గడిచిన ఐదు రోజుల నుంచి దేవాపూర్, కరంజివాడ, పరంధోళి అడవుల్లో హల్‌చల్ చేసి ఒక మేకను, రెండు కుక్కలను హతమార్చిన పులి.. సోమవారం మండలంలోని కెలికే అడవుల్లో తారసపడినట్లు, పులి అడుగులు కనిపించినట్లు ప్రచారం జరుగుతోంది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు మంగళవారం కెలికే అడవులను జల్లెడ పట్టారు. సుమారు 7 కిలోమీటర్లు అడవుల్లో తిరిగినా ఎలాంటి ఆచూకీ లభించలేదని అటవీ క్షేత్రాధికారి (ఎఫ్ఆర్‌వో) సయ్యద్ మజారోద్దిన్ తెలిపారు. కరంజివాడ, పరంధోళి అటవీ ప్రాంతాల్లో కెమెరా ట్రాకర్‌ను ఏర్పాటు చేసినా పులి జాడ తెలియలేదన్నారు. పరంధోళి అడవుల నుంచి మహారాష్ట్రకు పులి వెళ్లిపోయిందని అనుకుంటున్న తరుణంలో మళ్లీ కెలికే అడవుల్లో సంచారం చేస్తుందన్న వార్తతో గందరగోళం నెలకొంది. కెలికే గ్రామ పరిసర ప్రజలకు అటవీ అధికారులు అవగాహన కల్పించారు. ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని, అటవీ జంతువుల ద్వారా పెంపుడు జంతువులకు ఏదైనా హానీ జరిగితే నష్టపరిహారం అందిస్తామన్నారు. రాత్రివేళల్లో గ్రామంలో తిరగొద్దని, పొలాలకు వెళ్లద్దని హెచ్చరించారు. అత్యవసరమైతే గుంపులుగా వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో అటవీ అధికారులు విజయ్‌కుమార్, నజీర్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసం వద్ద భారత ప్రధాని పిలుపు మేరకు జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి, అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వీరులను స్మరించుకొని దేశ ఐక్యత కోసం ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. మాజీ ఎంపీపీ మల్లిఖార్జున్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, నాయకులు అశోక్, సుగుణాకర్, సత్తన్న, పెంటయ్య, శరత్, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని కార్మికుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న భగీరథ కార్మికులు

**కెరమెరి:** గడిచిన ఐదు నెలలుగా వేతనాలు లేక అల్లాడుతున్నామని, వెంటనే వేతనాలు విడుదల చేయాలని మంగళవారం ధనోరా ఫిల్టర్ బెడ్ ఇన్‌చార్జి గణేశ్‌కు మిషన్ భగీరథ కార్మికులు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రతీ నెలా వేతనాలు అందక పోవడంతో కుటుంబపోషణ కష్టంగా మారిందన్నారు. కొంత కాలంగా అధికారులను వేడుకుంటున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నెల 19 వరకు వేతనాలు రాకుంటే 20వ తేదీ నుంచి పంపులను బంద్ చేసి నిరసనలు, ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకుడు ఆనంద్, భగీరథ సంఘం మండలాధ్యక్షుడు బుడ్డయ్య, కార్మికులు అంకుష్, సంతోష్, సోనూ, చరణ్, షర్ఫోద్దిన్, మహబూబ్ తదితరులు ఉన్నారు.

# రైతుల ఖాతాల్లో జమ చేయాలి



నిరసన తెలుపుతున్న రైతులు

**బెజ్జూర్:** పంట రుణాలు తీసుకున్న రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నుంచి రుణమాఫీ నిధులు మంజూరైన వెంటనే జమ చేస్తుంటే, బెజ్జూర్ మండల సహకార సంఘం కార్యాలయంలో మాత్రం రైతుల అకౌంట్లో జమ చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అర్షద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని రుణమాఫీ రైతులతో కలిసి ముట్టడించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేసి నిధులు విడుదల చేస్తుంటే, సంఘం సీఈవో పర్ష సంజీవ్ కుమార్ రైతుల నుంచి డాక్యుమెంట్ తీసుకొని రైతుల అకౌంట్‌లో రుణమాఫీ నగదు జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రోజుల తరబడి రైతులను సహకార సంఘం కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. వెంటనే పంట రుణాలు తీసుకున్న రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేయాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**కౌటాల:** బ్యాంకు అధికారులు రైతులను ఇబ్బంది పెట్టవద్దని కన్నెపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు దుర్గం మోతీరాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ నగదును బ్యాంకు అధికారులు రైతులకు ఇవ్వడం లేదన్నారు. తిరుపతిగౌడ్, అశోక్ తదితరులు ఉన్నారు.

### వ్యసనాలకు దూరంగా ఉండాలి

**ఆసిఫాబాద్‌రూరల్:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మాదకద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అవగాహన కరపత్రాలు ఆవిష్కరించారు. రాజు, సాయి, హెచ్ఎం సుభాష్ పాల్గొన్నారు.

### 17న జిల్లాస్థాయి యోగా పోటీలు

**రెబ్బెన:** గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఈ నెల 17న జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసరి ఆంజనేయులుగౌడ్, ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్ తెలిపారు. క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డుతో ఈ నెల 17న ఉదయం 7 గంటలకు సీఈఆర్ క్లబ్‌లో హాజరు కావాలని సూచించారు. పోటీలకు 9 నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులు అర్హులని, బాలబాలికల విభాగంలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు ఆర్గనైజింగ్ కార్యదర్శి కేసరి ఆలేఖ్యను 80969 23672 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు

**ఆసిఫాబాద్‌రూరల్:** ఎయిడ్స్ నియంత్రణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీఈఎంవో గంగాధర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా ఎయిడ్స్ నియంత్రణపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌమారదశలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. హెచ్ఈవో శ్యాంలాల్, హెచ్ఎంలు సుభాష్, వైద్య సిబ్బంది సతీశ్, దిశ, లత, శిరీష పాల్గొన్నారు.

### చిరుధాన్యాల సాగుపై అవగాహన

**పెంచికల్‌పేట్:** చిరుధాన్యాల పంటల సాగు యాజమాన్యాల పద్ధతులపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఎల్కపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగుపైన రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు.

### మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**కెరమెరి:** మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మంగళవారం మండలంలోని జోడేఘాట్, బాబేఝరి గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఆయన మాట్లాడారు. మ్యూజియం చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలన్నారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ మోసీన్, టీఏ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

**పనుల్లో నాణ్యత ఉండాలి**

**చింతలమానెపల్లి:** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులను నాణ్యతతో నిర్వహించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని బాబాపూర్ గ్రామపంచాయతీలోని నందికొండ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు సౌజన్య, కార్యదర్శి హరిప్రసాద్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్యాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**విజయోత్సవ ర్యాలీకి తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు**

**రెబ్బెన:** ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే విజయోత్సవ ర్యాలీకి మంగళవారం మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు గోగర్ల రాజేశ్, నర్సింహులు, నర్సింగరావు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ వర్గీకరణ తీర్పును సవరించాలి**

**బెజ్జూర్:** ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీంకోర్టు పునఃసవరణ చేయాలని నాయకులు బసర్కార్ విశ్వనాథ్, జాడి దిలీప్‌కుమార్‌లు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం యూత్ అధ్యక్షుడు దుర్గం విజయ్, ఉపాధ్యక్షుడు కర్మే ఏమాజీ, మండల అధ్యక్షుడు కుమ్మరి పోశం, దుర్గం వామన్, కోట పెంటయ్య, కమిరే మొండి, దుర్గం రాందాస్, కామిరే వెంకటి, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

**బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం**

**దహెగాం:** ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఎంపీడీవో, యూడీసీ, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేందర్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన అధికారులను శాలువాతో ఘనంగా సన్మానించారు. పీఆర్ఏఈ ఆత్మారాం, ఈజీఎస్ ఏపీవో కల్పన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**వెటర్నరీ అసిస్టెంట్‌కు..**

**సిర్పూర్(టి):** మండల కేంద్రంలోని పశువైద్యశాలలో గత ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ శుద్ధపల్లి ప్రభు ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా లక్షెట్టిపేట మండలం రంగపేటకు వెళ్లగా మంగళవారం మండలంలోని గోపాలమిత్రలు ప్రభును శాలువాలతో సత్కరించి సన్మానించారు. మండలంలోని అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు చీపల్లి భాస్కర్, జుమిడి నాందేవ్, డోంగ్రె ప్రకాశ్, ఏముర్ల రాజేశ్వర్, వాసుదేవ్ పాల్గొన్నారు.

**జీఎంకు సన్మానం**

**రెబ్బెన:** బెల్లంపల్లి ఏరియా జీఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం.శ్రీనివాస్‌ను మంగళవారం ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు గోలేటిలోని జీఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంకు పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ నాయకులు ప్రకాశ్ రావు, ఐఎన్‌టీయూసీ నాయకులు మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లాస్, స్వామి, సాంబగౌడ్, దుర్గం రవీందర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

**జనక్‌ప్రసాద్ జన్మదిన వేడుకలు**

గోలేటి టౌన్‌షిప్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మంగళవారం ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ జన్మదిన వేడుకలను ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి**

**కౌటాల:** 317 జీవోతో స్థానికత కోల్పోయిన బాధిత ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తౌటం శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం ఆవరణలో 317జీవో బాధిత ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు శ్రీనివాస్, అంకుశ్ పాల్గొన్నారు.

**పాఠశాలల్లో క్రీడా పోటీలు**

**కెరమెరి:** పాఠశాలల్లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కెరమెరి, గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. క్విజ్, వ్యాసరచన పోటీలు, రన్నింగ్ హైజంప్, లాంగ్ జంప్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ వంటి క్రీడలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు ఆగస్టు 15న బహుమతులు ప్రదానం చేయనున్నారు.

# ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ రమేశ్

**కౌటాల:** కళాశాలల్లో విద్యార్థులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుల్లో రాణించాలన్నారు. యువత సోషల్ మీడియా అధికంగా వినియోగిస్తుందని, సైబర్ నేరాల బారిన పడితే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.మధుకర్, ప్రిన్సిపాల్ బాలకిషన్, అధ్యాపకులు ఆంజనేయులు, రాంబాబు, మోతిలాల్‌నాయక్, రవీందర్, ప్రకాశ్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

**వాంకిడి:** విద్యార్థులు మొదటి నుంచే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై ప్రశాంత్ సూచించారు. మంగళవారం మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగించినా, చెడు అలవాట్లకు ఆకర్షితులైనా వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు. మహిళలపై జరిగే నేరాలు, ఈవ్‌టీజింగ్, మహిళా చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు మాదకద్రవ్యాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

**చింతలమానెపల్లి:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతలమానెపల్లి ఎస్సై నరేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని డబ్బా గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ చేస్తామని చెబుతూ నేరగాళ్లు ఫోన్ చేస్తున్నారని ఓటీపీ చెప్పాలని అడిగితే నమ్మవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, గ్రూపు తగాదాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. పశువులను రహదారులపై వదిలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా తయారు చేసినా, విక్రయాలు నిర్వహించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హిందువులపై దాడులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

**జైనూర్:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంపూర్ణ బంద్ పాటించడంతో పాటు హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా మరణించిన హిందువుల ఆత్మశాంతికి మౌనం పాటించారు. విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు ఆత్రం భీంరావు, బీజేపీ కార్యదర్శి సందీప్, హెచ్ఆర్‌సీసీ జిల్లా చైర్మన్ సమాధాన్, బీజేపీ మండల అధ్యక్షుడు దౌలత్‌రావు, సాయి, రాంధన్, ప్రవీణ్, ధర్మేందర్, శివరాజ్ పాటిల్ తదితరులు ఉన్నారు.

### తేజాపూర్‌లో డ్రైడే

**వాంకిడి:** మండలంలోని తేజాపూర్ గ్రామంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం డ్రైడే నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మురికి నాలాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. హెచ్ఈవో రవిదాస్, ఎస్ఈసీ శ్రీతేజ, దినేశ్, బ్రీడింగ్ చెక్కర్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.